క్లుప్తంగా

నేడు శిద్దా నివాసం వద్ద అయ్యప్ప పడిపూజ

ఒంగోలు: అయ్యప్పస్వామి పడిపూజ కార్యక్రమం సోమవారం రాత్రి 7 గంటలకు స్థానిక మంగమూరు రోడ్డులోని మాజీ మంత్రి, వైఎస్సార్ సీపీ నాయకులు శిద్దా రాఘవరావు నివాసం వద్ద నిర్వహిస్తున్నారు. అయ్యప్ప, సర్వదీక్షా మాలధారులు, భక్తులు పాల్గొని భిక్ష, స్వామివారి తీర్థప్రసాదాలు స్వీకరించాలని శిద్దా రాఘవరావు దంపతులు, టీటీడీ పాలక మండలి సభ్యుడు శిద్దా సుధీర్ దంపతులు విజ్ఞప్తి చేశారు.

వైద్య శిబిరం నిర్వహణ సంతోషం



వైద్య శిబిరంలో చికిత్స అందిస్తున్న వైద్యులు

నాగులుప్పలపాడు: ప్రజల ఆరోగ్యం కోసం ప్రతి నెలా ఉచితంగా వైద్య శిబిరం నిర్వహించడం చాలా సంతోషంగా ఉందని మనం-మన ఊరు-మన ఈదుమూడి సేవా సంస్థ వ్యవస్థాపకుడు కావూరి వాసు అన్నారు. ఆరోగ్య సిరి కార్యక్రమంలో భాగంగా ఒంగోలు శ్రీరామ్ వైద్యశాల ఆధ్వర్యంలో ప్రతి నెలా నిర్వహించే ఉచిత వైద్య శిబిరాన్ని ఆదివారం ఈదుమూడి గ్రామంలో నిర్వహించారు. వైద్య శిబిరంలో డా.ధీరజ్, విజయ్‌కుమార్, హరికృష్ణ ప్రసాద్ మొత్తం 207 మందికి ఉచితంగా వైద్య పరీక్షలు చేసి మందులు అందజేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో మేనేజర్ దాసరి సుధాకర్ యాదవ్, పీఆర్వో లు రవి, నాగరాజు, సిబ్బంది పాల్గొన్నారు.

విద్యుత్ ఏఈగా మల్లికార్జున



ఒంగోలు రూరల్: ఒంగోలు రూరల్ మండల విద్యుత్ ఏఈగా మల్లికార్జున్ ఆదివారం బాధ్యతలు చేపట్టారు. విజయవాడ రూరల్ ఏఈగా పనిచేస్తున్న ఆయన బదిలీపై ఇక్కడ నియమితులయ్యారు. నూతన ఏడీని రూరల్ డీఈ, అర్బన్ ఇంజినీర్లు, జూనియర్ ఇంజినీర్లు, లైన్‌మెన్లు, ఏఈ ఆర్‌ఆర్ చెన్నారెడ్డి తదితరులు అభినందించారు.

కుల నిర్మూలన కోసం పోరాడాలి



పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న ప్రజాసంఘాల నాయకులు

ఒంగోలు టౌన్: దేశంలో పాతుకుపోయిన కుల వ్యవస్థను నిర్మూలించడానికి మార్క్సిస్టులు, అంబేడ్కర్‌వాదులు సమష్టిగా పోరాడాలని ఓపీడీఆర్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు చావలి సుధాకర్ పిలుపునిచ్చారు. ఆదివారం ఒంగోలు నగరంలో 'లాల్ నీల్ మైత్రి - నేటి అవసరం' పుస్తకాన్ని ప్రజాసంఘాల నాయకులు ఆవిష్కరించారు. కార్యక్రమంలో ప్రజాసంఘాల నాయకులు భీమవరపు సుబ్బారావు, దాసరి సుందరం, కొంగర నరసింహం, ఎంఏ సాలార్, అల్లు వెంకటేశ్వర్లు, నరసింహరావు, కొటారి జనార్ధన్, ఎం రమేష్ తదితరులు పాల్గొన్నారు.

ఆస్తి పంచలేదని ఫిర్యాదు

కురిచేడు: మండలంలోని పడమర గంగవరం గ్రామానికి చెందిన కోలా విజయకుమారి తన అత్త, చవితి కుమారులు తనకు ఆస్తి పంచటం లేదని పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఎస్‌హెచ్‌ఓ చిన్నయ్య తెలిపిన వివరాల ప్రకారం కోలా విజయకుమారి పడమర గంగవరం గ్రామానికి చెందిన కోలా చిన్న వెంకటేశ్వరరావును రెండో వివాహం చేసుకుంది. వెంకటేశ్వరరావు భార్య చనిపోవటంతో విజయవాడకు చెందిన విజయకుమారిని వివాహం చేసుకున్నాడు. అయితే ఏడాది క్రితం చిన్న వెంకటేశ్వరరావు మృతి చెందాడు. వెంకటేశ్వరరావుకు ఇద్దరు కుమారులున్నారు. అతనికి ఉన్న ఇల్లు, పాక స్థలంలో విజయకుమారికి వాటా ఇవ్వమని, వెళ్లిపోవాలంటూ వెంకటేశ్వరరావు కుమారులు కోలా నారాయణ, ఏడుకొండలు, వెంకటేశ్వరరావు తల్లి వెంకటనర్సమ్మ గొడవ పెట్టుకున్నారు. దీంతో విజయకుమారి పోలీసులకు ఫిర్యాదు చేసింది.

ఐదుగురు జూదరుల అరెస్టు

గుడ్లూరు: కోడి పందేల స్థావరంపై దాడి చేసి ఐదుగురు వ్యక్తులను పోలీసులు అరెస్టు చేశారు. ఈ సంఘటన మండలంలోని రామాపట్నం-కర్లపాలెం గ్రామాల మధ్య సముద్ర తీరం దగ్గర ఆదివారం సాయంత్రం జరిగింది. వివరాల్లోకి వెళితే. రామాయపట్నం-కర్లపాలెం గ్రామాల మధ్య కోడి పందేలు వేస్తున్న సమాచారం అందుకున్న ఎస్సై ప్రసాదరెడ్డి తన సిబ్బందితో కలిసి దాడిచేసి ఐదుగురు వ్యక్తులను అదుపులోకి తీసుకొని మూడు కోళ్లు రూ.3,500 నగదు స్వాధీనం చేసుకొని పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. వారిని కందుకూరు కోర్టులో హాజరు పరచనున్నట్లు ఎస్సై తెలిపారు.

కన్నుల పండుగలా

అయ్యప్ప మహా పడిభజన



స్వామివారికి అభిషేకాలను నిర్వహిస్తున్న జెడ్పీ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ, మాజీ ఎమ్మెల్యే బూచేపల్లి శివప్రసాదరెడ్డి



అయ్యప్పస్వామి పడి భజన సందర్భంగా పూజలు చేస్తున్న జెడ్పీ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ, మాజీ ఎమ్మెల్యే బూచేపల్లి శివప్రసాదరెడ్డి

చీమకుర్తి: స్థానిక బూచేపల్లి నివాసంలో ఆదివారం రాత్రి నిర్వహించిన అయ్యప్పస్వామి మహా పడిభజన కార్యక్రమం కన్నుల పండుగలా జరిగింది. అయ్యప్పస్వామి మాల ధరించిన జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ, మాజీ ఎమ్మెల్యే బూచేపల్లి శివప్రసాదరెడ్డి ఆధ్వర్యంలో ఇసుకవాగులోని 'సాక్షి రామలింగేశ్వరస్వామి' ఆలయంలో అయ్యప్పస్వామికి అభిషేకాలు నిర్వహించారు. ఊరేగింపుగా బూచేపల్లి నివాసంలో నిర్వహించే పడిపూజా భజన ప్రాంగణం వద్దకు తీసుకొచ్చారు. అయ్యప్పస్వామి మెట్లను సుందరంగా అలంకరించి స్వామికి బూచేపల్లి కుటుంబ సభ్యులతో పాటు భక్తులు పూజలు నిర్వహించారు. అనంతరం నిర్వహించిన పడిపూజా భజన కార్యక్రమంలో అయ్యప్పస్వామి భక్తులతో కలిసి బూచేపల్లి వెంకాయమ్మ భక్తిగీతాలను ఆలపించారు. భజన అనంతరం భక్తులకు బిక్షను ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో శివప్రసాదరెడ్డి సతీమణి బూచేపల్లి నందిని, వారి కుమారుడు, కుమార్తె, కుటుంబ సభ్యులతో పాటు సర్వమాలలు ధరించిన భక్తులు పాల్గొన్నారు.

పెన్షనర్లకు అండగా ఉంటాం



మాట్లాడుతున్న కమిషనర్ వెంకటేశ్వరరావు



సీనియర్ పింఛనుదారులను సత్కరిస్తున్న పింఛన్ల సంఘం నాయకులు

ఒంగోలు టౌన్: పెన్షనర్ల సమస్యలను పరిష్కరించేందుకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటామని నగర కమిషనర్ ఎం.వెంకటేశ్వరరావు పేర్కొన్నారు. స్థానిక భాగ్యనగర్‌లోని పెన్షనర్ల భవనంలో ఆదివారం నిర్వహించిన జాతీయ పెన్షనర్ల దినోత్సవానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. పెన్షనర్ల భవనానికి సంబంధించి పన్ను మినహాయింపు గురించి త్వరలోనే తగిన నిర్ణయం తీసుకుంటామని తెలిపారు. ఫ్యామిలీ పెన్షన్‌లో పుట్టిన తేదీ నమోదు, లైఫ్ సర్టిఫికెట్లపై పలు అపోహలకు ఎస్టీఓ రాజ్యలక్ష్మి సమాధానాలు ఇచ్చారు. తొలుత పెన్షన్ పితామహుడు డీఎస్ నకారా న్యాయ పోరాటం గురించి పలువురు సభ్యులు వివరించారు. నకారా చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం 25 మంది సీనియర్ పెన్షనర్లను సన్మానించారు. కార్యక్రమానికి సుమారు 150 మంది పెన్షనర్లు హాజరయ్యారు. జిల్లా అధ్యక్షుడు సానాల విశ్వరూపాచారి అధ్యక్షతన నిర్వహించిన ఈ కార్యక్రమంలో జిల్లా ట్రెజరీ శాఖ డిప్యూటీ డైరక్టర్ ఏ జగన్నాథరావు, ఏటీఓ రాజ్ కుమార్, సంఘ పూర్వ అధ్యక్షుడు కె.ఆల్ఫ్రెడ్, జి.ఓబులరెడ్డి, ఆళ్ల రఘురామిరెడ్డి, జిల్లెలమూడి వెంకటేశ్వర్లు, గర్నెపూడి ప్రభాకరరావు, బండి రాజయ్య, పఠాన్ మహబూబ్ ఖాన్, ఈ.సత్యనారాయణ, హరిబాబు, అల్లాబక్ష్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సంఘ అధ్యక్షుడు, పక్కన బాధ్యులు

ఘనంగా పెన్షనర్ల దినోత్సవం

ఒంగోలు సెంట్రల్: అఖిల భారత బీఎస్‌ఎన్‌ఎల్ పెన్షనర్స్ వెల్ఫేర్ అసోషియేషన్ ఆధ్వర్యంలో స్థానిక బీఎస్‌ఎన్‌ఎల్ కార్యాలయం ఆవరణలో ఆదివారం పెన్షనర్ల దినోత్సవం ఘనంగా నిర్వహించారు. అసోషియేషన్ అధ్యక్షుడు ఆర్.నాగేశ్వరరావు అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఇండియన్ డిఫెన్స్ సర్వీస్‌లో ఉద్యోగం చేస్తూ 1972లో రిటైరైన డీఎస్ నకారా కోర్టు ద్వారా చేసిన పోరాట ఫలితంగానే ఈరోజు ప్రశాంతంగా పెన్షన్ పొందగలుగుతున్నామని పేర్కొన్నారు. 1982 డిసెంబర్ 17న సుప్రీం కోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ వైబీ చంద్రచూడ్ 'పెన్షన్ అనేది ఉద్యోగి హక్కు, ప్రభుత్వం పెట్టే భిక్ష కాదు' అని చారిత్రాత్మకమైన తీర్పు వెలువరించారని గుర్తు చేశారు. నాటి న్యాయమూర్తిని, నకారాను ప్రతి పెన్షన్ దారుడు గుర్తుంచుకోవాల్సిన అవసరముందన్నారు. ముందుగా జెండా ఎగురవేశారు. నకారా చిత్ర పటానికి సంఘ బాధ్యులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అసోసియేషన్ నాయకులు కె.అంజయ్య, బీవీ సురేష్ కుమార్, తిరుపతి స్వామి, వెంకటేశ్వర్లు, మల్లికార్జునరావు తదితరులు పాల్గొన్నారు.

పెన్షనర్స్ డే సందర్భంగా సీనియర్లకు సత్కారం

చీమకుర్తి: పెన్షనర్స్ డే సందర్భంగా ఆదివారం చీమకుర్తిలోని యూటీఎఫ్ భవన్‌లో 75 సంవత్సరాలు నిండిన పింఛనుదారులందరినీ పెన్షనర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా అసోసియేషన్ అధ్యక్షుడు మర్రి లక్ష్మినారాయణ మాట్లాడుతూ పదవీ విరమణ పొందిన ఉద్యోగులకు ఇచ్చే పింఛను బహుమతి కాదని, అది వారి హక్కు అని సుప్రీం కోర్టు గతంలో ఇచ్చిన తీర్పును గుర్తు చేశారు. 75 సంవత్సరాలు నిండిన పింఛనుదారుల్లో పీ.సుబ్బారావు, బీ.వెంకటేశ్వర్లు, ఉమామహేశ్వరరావు, డి.వెంకటరంగం, దేవరాజులు, రమణారెడ్డి, సుబ్బారావు, గౌస్, చెంచయ్య, కోటేశ్వరరావు, బాపూజీలను అసోసియేషన్ తరఫున శాలువాలు కప్పి పూలమాలలతో ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో పెన్షనర్స్ అసోసియేషన్ కార్యదర్శి బండ్ల డేవిడ్, గౌరవ అధ్యక్షుడు ఎస్‌కే అజీద్, యూ.నారాయణరావు, ఎంవీఆర్, సభ్యులు పాల్గొన్నారు.

సంక్షేమం కొనసాగాలంటే జగనే రావాలి



సంక్షేమ లబ్ధిని వివరిస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు

ఒంగోలు టౌన్: నిరుపేద, మధ్య తరగతి ప్రజల సంక్షేమమే లక్ష్యంగా అనేక పథకాలు అమలు చేస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని రానున్న ఎన్నికల్లో గెలిపించుకోవాల్సిన అవసరం ఉందని వైఎస్సార్‌సీపీ డివిజన్ ఇన్‌చార్జి సుబ్బారావు పేర్కొన్నారు. మాజీ మంత్రి, ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసరెడ్డి ఆదేశాల మేరకు నగరంలోని 49వ డివిజన్‌లో ఆదివారం వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇంటింటికీ తిరిగి రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాల గురించి వివరించారు. పథకాల అమలు తీరును అడిగి తెలుసుకున్నారు. సచివాలయ వ్యవస్థ ద్వారా ప్రజలకు సత్వర సేవలను అందిస్తున్నట్లు చెప్పారు. జగనన్న ఆరోగ్య సురక్ష పథకం ద్వారా ప్రజల ఆరోగ్యానికి పెద్దపీట వేస్తున్నారన్నారు. కార్యక్రమంలో డివిజన్ నాయకులు బత్తుల కాశయ్య, శ్రీనివాసరెడ్డి, హరి, నాగేష్, వీరనారాయణ, రసూల్, పెద్దిరెడ్డి, సచివాలయ కన్వీనర్లు, వలంటీర్లు, గృహసారథులు పాల్గొన్నారు.

వల్లూరమ్మకు ప్రత్యేక పూజలు

టంగుటూరు: జిల్లాలో ప్రసిద్ధిగాంచిన వల్లూరమ్మ ఆలయంలో అమ్మవారిని ఆదివారం అధిక సంఖ్యలో భక్తులు దర్శించుకున్నారు. ఆలయ ప్రధాన అర్చకులు నాగేశ్వరరావు, ఉప ప్రధాన అర్చకులు ఉమాశంకర్ అమ్మవారి మూలవిరాట్‌కు అభిషేకాలు, కుంకుమ పూజలు చేశారు. గోత్రనామార్చనల అనంతరం తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు. వల్లూరమ్మ ఆలయ ట్రస్టు బోర్డు చైర్మన్ కాలె శ్రీనివాసులు, ఆలయ ఈఓ రమేష్ భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా ఏర్పాట్లు చేశారు.

పోలేరమ్మ తల్లికి ప్రత్యేక పూజలు

జరుగుమల్లి: మండల పరిధిలోని కామేపల్లిలో పోలేరమ్మ దేవాలయం ఆదివారం భక్తులతో కిటకిటలాడింది. జిల్లాలోని పలు ప్రాంతాల నుంచి తరలివచ్చిన భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారు. పంచామృత అభిషేకం అనంతరం అమ్మవారి మూల విరాట్‌ని అర్చకులు శ్రీనివాస శర్మ పుష్పాలతో అలంకరించారు. భక్తులు ఆలయ ప్రాంగణంలో పొంగళ్లు పెట్టి అమ్మవారికి నైవేద్యంగా సమర్పించారు. ఆలయానికి వచ్చిన భక్తులకు అసౌకర్యం కలగకుండా ఈఓ రావెళ్ల శివశంకర్, ధర్మకర్తల మండలి సభ్యులు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

అలరించిన ధూంధాం సంగీత కచేరి



ధూంధాంలో పాటలు పాడుతున్న ఖాదర్

ఒంగోలు టౌన్: ప్రముఖ గాయకుడు అబ్దుల్ ఖాదర్ ఆధ్వర్యంలో రుక్సానా మెలోడీ మేకర్స్ నిర్వహించిన ధూంధాం సంగీత విభావరి ప్రేక్షకులను అలరించింది. స్థానిక సీవీఎన్ రీడింగ్ రూంలో ఆదివారం సాయంత్రం అమర గాయకుడు ఘంటశాల, ప్రసిద్ధ గాయకుడు బాల సుబ్రహ్మణ్యం చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించిన అనంతరం కార్యక్రమాన్ని ప్రారంభించారు. వాయిస్ ఆఫ్ ఖాదర్ పేరుతో నిర్వహించిన ఈ కార్యక్రమంలో గాయకులు పోటాపోటీగా పాటలు ఆలపించారు. ఖాదర్‌తోపాటు ఎం.రాజకుమారి, అంజుస్వామి, విజయకుమార్, జయరాజ్, సూర్య, ఉన్నం శ్రీనివాసరావులు ప్రేక్షకులను ఉర్రూతలూగించారు. పోలీసు శాఖలో ఉద్యోగం చేస్తున్న గౌస్‌బాషా, రెహమాన్ పాడిన పాటలకు కరతాళ ధ్వనులతో ప్రేక్షకులు తమ అభినందనలు తెలిపారు.

భగవద్గీత కంఠస్థ పోటీల విజేతలకు బహుమతులు



బహుమతులందుకున్న విజేతలు

ఒంగోలు మెట్రో: తిరుమల తిరుపతి దేవస్థానం, హిందూ ధర్మ ప్రచార పరిషత్ ఆధ్వర్యంలో గీతా జయంతిని పురస్కరించుకుని సంపూర్ణ భగవద్గీత కంఠస్థ పోటీలను స్థానిక పెండ్యాల వారి సత్రంలో ఆదివారం నిర్వహించారు. న్యాయ నిర్ణేతలుగా శ్రీ చిలకపాటి రంగారావు, కొండూరి కృష్ణయ్య, గోలి విశ్వనాథం వ్యవహరించారు. ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులు వరుసగా పసుమర్తి రాధారాణి, గుర్రం సులోచన, గోనుగుంట మారుతి, వి.రాజ్యలక్ష్మి గెలుపొందారు. పెండ్యాల సత్రం నిర్వాహకులు ఐనాల శోభాదేవి, శ్రీలక్ష్మీ దేవి, జిల్లా రంగయ్య, జిల్లా పావని తదితరులు పాల్గొన్నారు. టీటీడీ ప్రోగ్రాం అసిస్టెంట్ రావినూతల రామకృష్ణ కార్యక్రమాన్ని పర్యవేక్షించారు.

బర్లీ పొగాకుకు గిరాకీ



పొగాకు బేళ్లను లారీకి ఎత్తుతున్న రైతులు

కురిచేడు: ఈ ఏడాది ఒక వైపు అనావృష్టి, అతివృష్టి నడుమ అన్నదాత అల్లాడి పోతున్నాడు. పంటలు పడక, పడిన పంటలు ఎదగక, ఎదిగిన పంటలు అతివృష్టికి కొట్టుకుపోయి నష్టపోతున్నాడు. బర్లీ పొగాకు ధర రైతుకు ఊరట నిచ్చింది. రైతుల వద్ద కొనుగోలు చేసిన పొగాకు గరిష్ఠంగా రూ. 15 వేలు పలికింది. దీంతో రైతుల ముఖాల్లో ఆనందం వ్యక్తమైంది.

గత ఏడాది అత్యధికంగా క్వింటాలు రూ. 11500, సగటున రూ. 10500 వరకు ధరపలకగా, ఈఏడాది తొలిరోజు 30 శాతం పెరగటంతో రైతులు సంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. ఐటీసీ కంపెనీ మొదటగా ఆ ధరతో కొనగోలు ప్రారంభించగా మిగతా కంపెనీలు తప్పనిసరి పరిస్థితుల్లో అదే ధరకు కొనుగోలు ప్రారంభించాయి. ఈ ఏడాది బర్లీ పొగాకు పంట ఆశించిన స్థాయిలో దిగుబడులు రావన్న అంచనాతో మార్కెట్ ధరలు పెరిగినట్లు భోగట్టా. ఏది ఏమైనా పొగాకు ధర ఇలాగే స్థిరంగా ఉండవచ్చని రైతులు, వ్యాపార వర్గాలు ఆశాభావం వ్యక్తం చేస్తున్నాయి.

గాదెపాలెంలో ఓవర్ హెడ్ ట్యాంక్‌కు భూమిపూజ



ఓవర్‌హెడ్ ట్యాంక్‌కు భూమి పూజ చేస్తున్న ఎంపీపీ అంజిరెడ్డి తదితరులు

గాదెపాలెం(కొత్తపట్నం): మండలంలోని గాదెపాలెం గ్రామంలో తాగునీటి సమస్యను శాశ్వతంగా పరిష్కరించేందుకు ఓవర్‌హెడ్ ట్యాంక్ నిర్మిస్తున్నట్లు ఎంపీపీ లంకపోతు అంజిరెడ్డి పేర్కొన్నారు. సర్పంచ్ గాదె సుబ్బారెడ్డి, ఎంపీటీసీ సభ్యురాలు దొడ్ల స్వాతితో కలిసి మాజీ మంత్రి, ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసరెడ్డికి నీటి సమస్య గురించి వివరించగా రూ.36.5 లక్షలు మంజూరు చేయించారని ఎంపీపీ వివరించారు. గ్రామ ప్రజాప్రతినిధులతో పాటు ఆర్‌డబ్ల్యూఎస్, ఇతర అధికారులతో కలిసి ఓవర్‌హెడ్ ట్యాంక్ నిర్మాణానికి ఎంపీపీ ఆదివారం భూమిపూజ చేశారు.

ఎంపీపీ మాట్లాడుతూ.. గాదెపాలెం గ్రామానికి జల్‌జీవన్ మిషన్ కింద మంజూరైన రూ.36.5 లక్షలతో 40 వేల లీటర్ల సామర్థ్యం కలిగిన ఓవర్ హెడ్ ట్యాంక్ నిర్మిస్తున్నట్లు తెలిపారు. తద్వారా 250 కుటుంబాలకు రోజూ తాగునీరు అందించనున్నట్లు చెప్పారు. ఇప్పటికే గ్రామంలోని 240 గృహాలకు ఉచితంగా కుళాయి కనెక్షన్లు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో ఆర్‌డబ్ల్యూస్ ఏఈ వంశీకృష్ణారెడ్డి, సర్పంచ్ గాదె సుబ్బారెడ్డి, నాయకులు ఈతముక్కల ప్రసాద్, గాదె భద్రిరెడ్డి, సీహెచ్ నరసింహారెడ్డి, గాదె కోటిరెడ్డి, గాదె శ్రీకాంత్‌రెడ్డి, సచివాలయ ఇంజినీరింగ్ అసిస్టెంట్ మహేష్, కార్యదర్శి సురేష్ తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్ సీపీ కార్యకర్తలకు సముచిత స్థానం



జెడ్పీ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ, మాజీ ఎమ్మెల్యే బూచేపల్లి శివప్రసాదరెడ్డికి పుష్పగుచ్ఛం అందిస్తున్న మొగిలిశెట్టి వెంకటేశ్వర్లు

చీమకుర్తి: వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీలో చిత్తశుద్ధితో పనిచేసే కార్యకర్తలకు పార్టీ అధినాయకత్వం సముచిత స్థానం ఇస్తుందని జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ, మాజీ ఎమ్మెల్యే బూచేపల్లి శివప్రసాదరెడ్డి అన్నారు. వైఎస్సార్ సీపీలో పలు అనుబంధ సంఘాల్లో నియమితులైన నాయకులు ఆదివారం చీమకుర్తిలోని బూచేపల్లి నివాసంలో బూచేపల్లి వెంకాయమ్మ, శివప్రసాదరెడ్డిని మర్యాదపూర్వకంగా కలుసుకొని పుష్పగుచ్ఛాలు అందించి కృతజ్ఞతలు తెలిపారు.

వైఎస్సార్‌సీపీ జిల్లా యూత్ జాయింట్ సెక్రటరీగా నియమితులైన మొగిలిశెట్టి వెంకటేశ్వర్లు ఈ సందర్భంగా బూచేపల్లి వెంకాయమ్మ, శివప్రసాదరెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. బీసీ సెల్ జిల్లా సెక్రటరీగా చీమకుర్తికి చెందిన షేక్ ఖాదర్‌బాషా నియమితులైన సంగతి తెలిసిందే. వారికి చీమకుర్తిలోని వైఎస్సార్ సీపీకి చెందిన పలువురు నాయకులు శుభాకాంక్షలు తెలిపారు.

శోభాయమానంగా గిరి ప్రదక్షిణ



గిరి ప్రదక్షిణలో పాల్గొన్న భక్తులు

ఒంగోలు మెట్రో: మార్గశిర మాసం, శ్రవణా నక్షత్రాన్ని పురస్కరించుకుని ఆదివారం ఉదయం శ్రీగిరి గిరి ప్రదక్షిణ అత్యంత భక్తి ప్రపత్తులతో నిర్వహించారు. స్థానిక కోర్టు సెంటర్ వద్ద గల బాపూజీ గో సంరక్షణ సంఘం నుంచి గ్రంథాలయం, కేశవ స్వామిపేట, శర్మ కాలేజ్ గ్రౌండ్, గద్దలగుంట, కొణిజేడు బస్టాండ్ మీదుగా ఒంగోలు కొండమీద శ్రీగిరి ఆలయం భక్తులు ప్రదర్శన నిర్వహించారు. గోవింద నామస్మరణతో గిరి ప్రదక్షిణ మార్గం మారుమోగింది. సుందరంగా అలంకరించిన స్వామి రథం ముందు గోమాత కదలగా గరుడ హనుమత్, శంఖు చక్రాలతో భక్తులు గోవింద నామాలు పలుకుతూ గిరి ప్రదక్షిణ చేశారు. పౌర్ణమి రోజు సాయంత్రం 5 గంటలకు శ్రీ గిరి గిరి ప్రదక్షిణ కార్యక్రమం నిర్వహించనున్నట్లు కమిటీ సభ్యులు తెలిపారు.

లోకానికి ప్రేమ సందేశం ఇచ్చిన క్రిస్మస్



అంధ విద్యార్థులకు దుస్తులు పంపిణీ చేస్తున్న దోస్తీ ఫౌండేషన్ ప్రతినిధులు



సెమీ క్రిస్మస్ వేడుకలో పాల్గొన్న డాక్టర్ జీవన్, డాక్టర్ జాలాది మణిబాబు

ఒంగోలు టౌన్: సమాజానికి ప్రేమ సందేశం ఇచ్చిన ప్రభువు ఏసు పుట్టిన రోజును పురస్కరించుకొని ప్రపంచం మొత్తం క్రిస్మస్ నిర్వహించుకుంటోందని దోస్తీ ఫౌండేషన్ చైర్మన్ షేక్ మహబూబ్ పేర్కొన్నారు. నగరంలోని రావి ఆంజనేయులు వీధిలోని గుడ్ న్యూస్ మినిస్ట్రీస్ అంధుల పాఠశాలలో ఆదివారం సెమీ క్రిస్మస్ వేడుకను ఘనంగా నిర్వహించారు. తొలుత అంధ విద్యార్థులకు దుస్తులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో మారెళ్ల సుబ్బారావు, ఆశాజ్యోతి, కవిత, యువరాజ్, బ్లెస్సీ పాల్గొన్నారు.

ఒంగోలు మెట్రో: ఎస్సీ, ఎస్టీ జర్నలిస్ట్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో సెమీ క్రిస్మస్ వేడుకలు అత్యంత వైభవంగా జరిగాయి. నగరంలోని రైల్వే స్టేషన్ రోడ్డులో ఉన్న పేస్ ఎస్‌ఆర్ స్కూల్లో శనివారం రాత్రి ఏర్పాటు చేసిన ఈ వేడుకల్లో అతిథులుగా ప్రముఖ పారిశ్రామికవేత్త కంది రవిశంకర్, ఒంగోలు నగర డీఎస్పీ నారాయణ స్వామిరెడ్డి, గొట్టిపాటి నాగేశ్వరరావు, బీఎం నరేష్, ప్రముఖ డాక్టర్ జీవన్ దంపతులు హాజరై క్రిస్మస్ కేక్ కట్ చేశారు. ముందుగా డాక్టర్ జాలాది మణిబాబు దైవ సందేశం ఇచ్చారు. అసోసియేషన్ అధ్యక్షుడు గేరా అజయ్ బాబు నేతృత్వంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో పలువురు జర్నలిస్టులు, వారి కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

ఉత్సాహంగా షటిల్ బ్యాడ్మింటన్ పోటీలు

ఒంగోలు: క్రిస్మస్ పండుగను పురస్కరించుకుని స్థానిక ఏబీఎం జూనియర్ కాలేజీ ఆవరణలో షటిల్ బ్యాడ్మింటన్ పోటీలు నిర్వహించారు. టోర్నమెంట్ ఆదివారం ముగిసింది. మొత్తం పది టీములు తలపడ్డాయి. విన్నర్స్‌గా రైజీ టీమ్, రన్నర్స్‌గా శ్రీనివాసరావు, దేవ్ టీం నిలిచాయి. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా మంగమూరు రోడ్డు ఎస్‌బీఐ బ్రాంచ్ డిప్యూటీ మేనేజర్ చంద్రశేఖర్, ఫినో కంపెనీ స్టేట్ హెడ్ కొప్పోలు ఏడుకొండలరావు, డాక్టర్ రాజ్‌విమల్ హాజరై విజేతలకు జ్ఞాపికలు, మెడల్స్ అందించారు. అనంతరం క్రిస్మస్ కేక్ కట్ చేసి క్రీడాకారులకు పంచి పెట్టారు. సీనియర్ క్రీడాకారులు వై.మల్లి, వై.కృష్ణారావు, పి.మాల్యాద్రి, ఏపూరి , కె.బాలు, నానీ, సతీష్, రెహానా, గ్లోరీ, సౌమ్య తదితరులు పాల్గొన్నారు.